

విద్యార్థులకు ఎంఎల్‌సి తోట అభినందన

ప్రజాశక్తి - మండపేట

రిలయన్స్ ధీరుభాయ్ అంబానీ క్విజ్-2022 పోటీల్లో ప్రతిభ కనబర్చినశ్రీ గౌతమి మున్సిపల్ హై స్కూల్ విద్యార్థులు పావని దుర్గ, దినేష్, నిహారిక, హరీష్‌లతోపాటు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు రామచంద్రారెడ్డిని స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎంఎల్‌సి మెల్సీ తోట త్రిమూర్తులు, మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి సోమవారం అభినందించారు. ఈ క్విజ్ పోటీలలో విద్యార్థులు జిల్లా మొదటి, మూడవ స్థానాలను కైవసం చేసుకున్నారు. రూ.40 వేల విలువైన ల్యాప్‌టాప్‌లు, రూ.8వేల విలువైన రెండు సైకిళ్లను సొంతం చేసుకున్నారు. విద్యార్థులను అభినందించిన వారిలో కౌన్సిల్ విప్ పోతంశెట్టి వరప్రసాద్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రెడ్డి రాజబాబు, కమిషనర్ టి.రాంకుమార్, హెచ్‌ఎం శోభావలి, వై.వెంకన్నబాబు ఉన్నారు.

రైతులు ఆందోళన చెందొద్దు

తడిసిన ధాన్యం కొనుగోలుకు చర్యలు
కలెక్టర్ హిమాన్షుశుక్లా

ప్రజాశక్తి - అమలాపురం, ఉప్పలగుప్తం, మామిడికుదురు

తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వపరంగా కొనుగోలు చేసి రైతులను అన్ని విధాల ఆదుకుంటామని కలెక్టర్ హిమాన్షు శుక్లా భరోసా ఇచ్చారు. సోమవారం ఆయన అంబాజీపేట మండలం ఇసుకపూడి, పి.గన్నవరం మండలం రాజులపాలెం గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటించారు. మాండోస్ తుపాన్ ప్రభావంతో కురిసిన వర్షాలకు తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. కళ్లాలు, రోడ్లపైన ఉన్న ధాన్యం రాశులు గోనెసంచులు, బరకాల్లో భద్రపరిచిన ధాన్యం స్థితిగతులను పౌరసరఫరాల, రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో కలసి నిశితంగా పరిశీలించారు. రైతాంగం ఎంతో శ్రమపడి చెమటోడ్చి పండించిన ధాన్యాన్ని కనీస మద్దతు ధర కన్నా తక్కువకు విక్రయించరాదని ప్రభుత్వమే రైతాంగానికి గిట్టుబాటు ధరలు కల్పించి అన్ని విధాలుగా ఆదుకుంటుందన్నారు. రైతాంగం భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. రైతు పక్షపాతిగా ప్రభుత్వం అనేక సంస్కరణలను సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. దీనిలో భాగంగానే గిట్టుబాటు ధరలు కల్పించడానికి పటిష్టమైన చర్యలు చేపట్టిందన్నారు. రైతులు కంగారుపడి మధ్య దళారుల చేతి లో మోసపోకూడదన్నారు. ఆర్‌బికెలను ఆశ్రయించి అధికారుల తోడ్పాటుతో ప్రతి గింజకు గిట్టుబాటు ధర పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట ఆర్‌డిఒ ఎం.ముక్కంటి, పౌరసర ఫరాల జిల్లా మేనేజర్ కె.తులసి, తహశీల్దార్లు రవీంద్రనాథ్ ఠాగూర్, జోసెఫ్ వ్యవసాయ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.


అంబాజీపేట మండలంలో పర్యటిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

పంట నష్టంపై అధికారుల పరిశీలన

తుపాను వల్ల కురిసిన వర్షాలకు పాడైన పంటలు, తడిసిన ధాన్యాన్ని అధికారులు సోమవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఉప్పలగుప్తం మండలం భీమనపల్లిలో జాయింట్ కలెక్టర్ ధ్యాన్‌చంద్ర ఆకస్మిక పర్యటన చేశారు. ఆరబోసిన ధాన్యాన్ని పరిశీలించారు. రైతుతతో మాట్లాడారు. తేమశాతం తక్కువ ఉండేటట్లు చేసి అమ్ముకోవాలన్నారు. ఏమైనా సందేహాలు ఉంటే తహశీల్దార్‌ను సంప్రదించాలన్నారు. పంట పరిస్థితులపై ఎఒ జి.కుమార్‌బాబును వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహశీల్దార్ జవ్వాది వెంకటేశ్వరి, ఎంపిడిఒ కెఎస్.గౌరీకుమారి, విఆర్‌ఒలు ఉన్నారు. మామిడికుదురులో తహశీల్దార్ నాగలక్ష్మమ్మ, వ్యవసాశాఖాధికారి మృదుల నష్టపోయిన పంటలను పరిశీలించారు. పంట నష్టం వివరాలను నమోదు చేసి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని వారు తెలిపారు.


ఉప్పలగుప్తం మండలం కిత్తన చెరువులో రైతులతో మాట్లాడుతున్న జెసి


మామిడికుదురులో పనలపై ఉన్న పంటను పరిశీలస్తున్న తహశీల్దార్, ఎఒ


విజేతలతో పిడిఎఫ్ ఎంఎల్‌సి ఐ.వెంకటేశ్వరరావు తదితరులు

ముగిసిన జిల్లా స్థాయి చెకుముకి సంబరాలు

ప్రజాశక్తి - అమలాపురం, ఆత్రేయపురం

జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు సోమవారంతో ముగిశాయి. అమలాపురం జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విజేతలకు బహుమతి ప్రదానం సభను నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 41 టీములు ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల నుంచి సంబరాల్లో పాల్గొన్నాయి. రాత పరీక్ష, క్విజ్ పోటీల్లో సాధించిన మార్కుల ఆధారంగా విజేతలను ఎంపిక చేశారు. విజేతలు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనున్నారు. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో ఆత్రేయపురం మండలం ర్యాలి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.యామిని, బి.లీలా పెద్దిశ్రీ, పి.జ్యోత్స్న, శ్రీదేవి జట్టు ప్రథమ స్థానం సాధించింది. ప్రయివేటు పాఠశాలల విభాగంలో అమలాపురం పట్టణం ఎస్‌పి ఆర్‌ఎం బ్లూ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఎం.సాయిరాం, పి.రేష్మిత, పి.జాహ్నవి జట్టు ప్రథమ స్థానంలో నిలిచింది. వీరు 2023 జనవరి 21, 22 తేదీల్లో కడపలో జరిగే రాష్ట్ర స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొనున్నారు. జిల్లా స్థాయి విజేతలకు ఎంఎల్‌సి ఐవి చేతుల మీదుగా బహుమతులు అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అమలాపురం మున్సిపల్ చైర్ పర్సన్ రెడ్డి సత్యనాగేంద్రమణి, అతిధులుగా రెడ్డి సత్యనారాయణ, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ, వైస్ ప్రెసిడెంట్ సప్పా నాగేశ్వరరావు, రైల్వే సాధన సమితి నాయకుడు కుడుపూడి సూర్యనారాయణరావు, కౌన్సిలర్ సంసాని బులినాని, జెవివి జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ ఇఆర్.సుబ్రహ్మణ్యం, రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డాక్టర్ చెలికాని స్టాలిన్, డా.చల్లా రవికుమార్, అధ్యక్ష కార్యదర్శులు జె.సత్యనారాయణ, కెవివి.సత్యనారాయణ హాజరయ్యారు.

విజేతలకు అభినందన

చెకుముకి రాష్ట్ర స్థాయి పోటీలకు మండలంలోని ర్యాలి జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు జోత్స్న, శ్రీదేవి, లీల,యామినిలను పలువురు అభినందించారు. జడ్‌పిటిసి సభ్యులు బి.సాయిబాబా, ఎంపిపి కె.అన్నపూర్ణ, ఎంపిడిఒ నాతి బుజ్జి, ఎంఇఒ వరప్రసాదరావు, ఛైర్మన్ బంగారు శాస్త్రి,, చెకుముకి మండల కన్వీనర్లు, ప్రముఖ ఇంద్ర జాలికుడు శ్యామ్ జాదుగర్, వాసుకి, ప్రసాద్, గోవిందు, గ్రామ పెద్దలు, ఉపాధ్యాయుతుల అభినందించిన వారిలో ఉన్నారు.

అర్జీలపై దృష్టి సారించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - అమలాపురం

స్పందనలో ప్రజల నుంచి వచ్చిన అర్జీల పరిష్కారంపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ హిమాన్షుశుక్లా అన్నారు. సోమవారం కలెక్టరేట్ స్పందన హాల్లో జెసి ధ్యానచంద్ర, డిఆర్‌ఒ సిహెచ్.సత్తిబాబులతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లా కేంద్రానికి రాలేక పోతున్న అర్జీదారుల సమస్యలను క్షేత్ర స్థాయిలోనే పరిష్కరించేందుకు వీలుగా డివిజన్ కేంద్రాలలో జిల్లా స్థాయి స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సోమవారం నిర్వహించిన జిల్లా స్థాయి స్పందనలో 175 అర్జీలు స్వీకరించామని తెలిపారు. అర్జీలను నాణ్యతతో నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని అధికారులకు సూచించారు. సమస్య పరిష్కారంపై ఆయా శాఖల అధికారులు అర్జీదారుల ప్రతిస్పందనను స్వయంగా తెలుసుకొని పరిష్కార నివేదికకు ఫోటోలు కూడా జత చేయాలని సూచించారు. ఒకే అంశంపై దరఖాస్తులు మళ్లీ రాకుండా స్పష్టమైన సమా చారంతో సంతృప్తికర స్థాయిలో అర్జీలను గడువులోగా పరిష్కరించాలన్నారు. జెసి ధ్యానచంద్ర మాట్లాడుతూ జిల్లా స్థాయి అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలో గ్రామ సచివాలయాలను సందర్శించాలన్నారు. ఆయా శాఖలకు సంబంధించిన అంశాలపై సచివాలయ సిబ్బందికి అవగాహన పెంపొందించి అర్జీలు సత్వర పరిష్కారానికి తోడ్పాటు నందించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఒ వి.కృష్ణకుమారి, డిసిహెచ్‌ఎస్ పద్మశ్రీ రాణి, ఐసిడిఎస్ పీడీ జివి.సత్యవాణి, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.


స్పందనలో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హిమాన్షుశుక్లా

'తమ్మన'కు పలువురి అభినందన

ప్రజాశక్తి - ఆలమూరు

ఎంఎల్ఎ చిర్ల జగ్గిరెడ్డి చేపట్టిన మహాపాదయాత్రలో పాల్గొన్న వైసిపి మండల కన్వీనర్, చెముడులంక సర్పంచ్ తమ్మన శ్రీనివాస్‌ను, స్థానిక శ్రేణులను కార్యదర్శి యు.రేణుక ఆధ్వర్యంలో పలువురు అధికారులు సోమవారం అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు డి.వెంకటేశ్వరరావు, డి.చంటి, ఎ.వీర్రాజు, ఎన్.సత్యనారాయణ, డి.వెంకట్రామయ్య, డి.శ్రీను, సుంకర శ్రీనువాస్, టి. హరిహరకుమార్, ఆర్.వెంకటేష్, ఎం.సురేష్, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

కరాటేలో జొన్నాడ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఆలమూరు

గుంటూరు జిల్లా చిలకలూరిపేటలో ఈ నెల 11న న్యూ సోలియన్ కుంగ్ - ఫూ సంస్థ నిర్వహించిన నేషనల్ కుంగ్‌ఫూ, కరాటే పోటీల్లో జొన్నాడ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. జొన్నాడ కుంగ్-ఫూ స్కూల్ విద్యార్థులు పలు విభాగాలలో పతకాలు సాధించారని కోచ్ కె.సత్తిబాబు సోమవారం తెలిపారు. వైట్ బెల్ట్ కట్టాస్ విభాగంలో అభి, కె.జైదుర్గాసాయిచరణ్, బాలికల స్పారింగ్ వైట్ బెల్ట్ విభాగంలో మూలస్థానం విద్యార్థి సుస్మాంజలి, బాయ్స్ బ్లూ బెల్ట్ విభాగంలో ఎ.సురేష్ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. బ్రౌన్ బెల్ట్ విభాగంలో ఎస్-ఎస్‌వి.శివ రెండవ స్థానం పొందగా, సీనియర్ బ్లాక్ బెల్ట్ విభాగంలో పి.నానిబాబు మూడవ స్థానంలో నిలిచారు. విజేతలను కుంగ్‌ఫూ గ్రాండ్ మాస్టర్ టి.అబ్బులు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు అభినందించారు.

అరెస్టులకు సిపిఎం ఖండన

ప్రజాశక్తి - అమలాపురం

సబ్ ఇన్‌స్పెక్టర్, పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల వయోపరిమితిని 5ఏళ్లుపెంచాలని డివైఎఫ్ఐ, ఆంధ్రప్రదేశ్ ఉద్యోగ పోరాట సమితి ఆధ్వర్యంలో సామరస్యంగా నిరసన తెలియజేయడానికి వెళ్తున్న నాయకులను, నిరుద్యోగ అభ్యర్థులను అరెస్టు చేయడాన్ని సిపిఎం జిల్లా కమిటీ ఖండించింది. తక్షణం వారిని బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలో ఉన్నత చదువులు చదువుకుని ఉద్యోగాలు లేక లక్షలాది మంది యువతీయువకులు నిరుద్యోగులుగా ఉన్నారని తెలపారు. అనేకేళ్లుగా ప్రభుత్వాలు ఉద్యోగావకాశాలు కల్పిస్తాయని ఆశతో ఎదురు చూడటంతో వయోపరిమితి కూడా దాటిపోతోందన్నారు. ఇటీవల విడుదల చేసిన ఎస్ఐ, కానిస్టేబుల్స్ నోటిఫికేషన్‌కు సంబంధించి వయోపరిమితి ఐదేళ్లకు పెంచాలని రాష్ట్ర వ్యాప్తంగా అనేక రూపాలలో నిరసనలు జరుగుతున్నాయన్నారు. ప్రభుత్వం న్యాయం చేస్తామని చెబుతూ కాలం గడిపేస్తుందన్నారు. విసుగు చెందిన యువతీయువకులు నిరసన తెలియజేయడానికి విజయవాడకు వెళ్తుండగా మధ్యలోనే పోలీసులు అడ్డుకుని వెనక్కి పంపేయడం తగదన్నారు. ధర్నా చౌక్‌లో నిరసన తెలియజేయడానికి వెళుతున్న డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై.రాము, జి.రామన్న, ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.కృష్ణ, ఎన్.నాగేశ్వరరావు, కృష్ణా జిల్లా కార్యదర్శి టి.బాజీ, గుంటూరు జిల్లా కార్యదర్శి కష్ణకాంత్, పోరాట సమితి నాయకులతోపాటు 60 మందిని అక్రమంగా అరెస్టులు చేశారన్నారు. వారిని వెంటనే విడుదల చేయాలన్నారు. సమస్య తీవ్రతను గమనించి తక్షణమే వయోపరిమితిని పెంచాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయడానికి వెంటనే నోటిఫికేషన్లు ఇవ్వాలని ఈ సందర్భంగా మాండ్ చేశారు.

కుమారుని బారి నుంచి రక్షించాలని
మాజీ ఎంఎల్ఎ పులపర్తి సతీమణి ఫిర్యాదు

అమలాపురం : తన కుమారుడు రవిబాబు బారి నుంచి రక్షించాలని పి.గన్నవరం మాజీ ఎంఎల్ఎ పులపర్తి నారాయణమూర్తి సతీమణి వెంకటలక్ష్మి సోమవారం స్పందనలో అధికారులకు ఫిర్యాదు చేశారు. తన పేరున ఉన్న ఆస్తులను అమ్మి వీధి పాలు చేస్తున్నాడని తెలిపారు. తన వద్ద ఉన్న కారును సైతం పట్టుకెళ్లిపోయాడని తెలిపారు. ఈ మేరకు తన నలుగురు కుమార్తెలతో కలిసి వచ్చి ఎస్‌పికి ఆమె ఫిర్యాదు చేశారు.

తాపేశ్వరంలో విద్యా వనభోజన వేడుకలు

మండపేట : మండలంలోని తాపేశ్వరం శ్రీ పోలిశెట్టి సత్తిరాజు శ్రీమతి భూషణం ఉన్నత పాఠశాలలో విద్యా వనభోజనాల వేడుకలు సోమవారం జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సురుచి అధినేత, విద్యాదాత పోలిశెట్టి మల్లిబాబు మాట్లాడుతూ చిన్నారుల భవిష్యత్తుకు ఉపాధ్యాయులతో పాటు తల్లితండ్రులు కూడా బాధ్యత వహించాలన్నారు. విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. ఈ సందర్భంగా జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ అలరించాయి. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం వీరన్న, పిఎంసి ఛైర్మన్ గుబ్బల దేవి పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరంగా గ్రామాలు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

సిఎం జగన్మోహన్ రెడ్డి పాలనలో గ్రామాలు అభివృద్ధికి నోచుకోవడం లేదని టిడిపి నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కిత్తనచెరువులో సోమవారం టిడిపి అమలాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎంఎల్ఎ అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో 'ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరిగి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు వివరించారు. ప్రభుత్వ విధానాల వల్ల పడుతున్న భారాలను తెలియజేశారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే చంద్రబాబును సిఎం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అమలాపురం పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గంటి హరీష్‌మాధూర్‌బాలయోగి, మాజీ ఎంఎల్ఎ చిల్లా జగదీశ్వరి, జడ్‌పిటిసి మాజీ సభ్యులు దేశంశెట్టి లక్ష్మీనారాయణ, టిడిపి మండల అధ్యక్షుడు అరిగెల నానాజీ, గ్రామ కమిటీ అధ్యక్షుడు పోతుల బుజ్జి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'సంక్షేమ పథకాల అమలే లక్ష్యం'

కపిలేశ్వరపురం : పేదలకు సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎల్‌సి తోట త్రిమూర్తులు అన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సోమవారం పడమర ఖండ్రిక, అంగర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఇంటింటా తిరిగి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యలు పరిష్కారం కోసం సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పథకాల వల్ల కలిగే లబ్ధిని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పలువురు వైసిపిలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి తోట ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు వాసా కోటేశ్వరరావు, తిరునాతి ఆదిలక్ష్మి, జడ్‌పిటిసి సభ్యులు పి.వీరవెంకట సూర్యనారా యణ, ఎంపిపి ఎం.సత్యవేణి, ఎంపిటిసి సభ్యులు తదితరులుపాల్గొన్నారు

జోనల్ స్థాయి బాడ్మింటన్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి - అమలాపురం

జోన్-2 జోనల్ స్థాయి బాడ్మింటన్ పోటీలు స్థానిక ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో సోమవారం ప్రారంభమయ్యాయి. మున్సిపల్ ఛైర్మన్ రెడ్డి సత్యనాగేంద్రమణి వీటిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అమలాపురం జడ్‌పిటిసి సభ్యులు పందిరి శ్రీహరిరామగోపాల్, ఉప్పలగుప్తం జడ్‌పిటిసి సభ్యులు గెడ్డం సంపదరావు, కౌన్సిలర్లు జి.రమేష్, సిహెచ్.రామకృష్ణ, దొంగ నాగసుధారాణి, యాళ్ల సతీష్, రంకిరెడ్డి కాశీ విశ్వనాథం, ఛీఫ్ కోచ్ సురేష్, ఛీఫ్ రిఫరీ శ్రీనివాస్ పాల్గొన్నారు. 7 జిల్లాలకు చెందిన పురుషులు, మహిళా జట్లు తలపడనున్నాయి. విజేతలు ఈ నెల 20న జరిగే రాష్ట్ర స్థాయి పాల్గొంటారు.


జెసికి వినతిపత్రం అందిస్తున్న క్రైస్తవ సంఘాల నాయకులు

క్రైస్తవుల శ్మశానాన్ని రక్షించాలని వినతి

ప్రజాశక్తి అమలాపురం రూరల్

క్రైస్తవుల శ్మశానాన్ని పరిరక్షించాలని సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో జెసి ధ్యాన్‌చంద్‌కు వివిధ క్రైస్తవ సంఘాల నాయకులు వినతిపత్రం అందించారు. రోడ్డు విస్తరణలో భాగంగా అమలాపురం రూరల్ మండలం నడిపూడి అక్విడెక్టు వద్ద నిర్మిస్తున్న బ్రిడ్జి పనిలో కొన్ని క్రైస్తవ సమాధులు కదిలి కూలిపోయాయన్నారు. మరికొన్ని కూలేందుకు సిద్ధంగా ఉన్నాయనే విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ శ్మశాన వాటిక ఆక్రమణలకు గురైందని, తమ శ్మశానవాటికకు సరిహద్దులను ఏర్పరచి గోడను నిర్మించాలని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. దీనిపై జాయింట్ కలెక్టర్ స్పందించారు. త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. జెసిని కలిసిన వారిలో జిల్లా యునైటెడ్ పాస్టర్స్ వైస్ ప్రెసిడెంట్ ఎర్నెస్ట్ తాతపూడి, జిల్లా సెక్రెటరీ ముంగి యెహోషువా, అమలాపురం మండల కో ఆప్షన్ సభ్యుడు, అమలాపురం మండల యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ మొసలి స్పర్జన్‌రాజు, అమలాపురం మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు బిల్లీ తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని విఆర్‌ఒల ధర్నా

కపిలేశ్వరపురం : సమస్యలను పరిష్కరించాలని విఆర్‌ఒలు తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్ కె.సూర్యారావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విఆర్‌ఒల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అల్లాడి మల్లేశ్వరరావు మాట్లాడారు. పని ఒత్తిడి కారణంగా చనిపోయిన విఆర్‌ఒల కుటుంబాలకు రూ.25 లక్షల ఆర్థిక సాయం అందించాలన్నారు. పని ఒత్తిడి తగ్గించాలని, భూ రీసర్వేకు ఖర్చు చేసిన సొమ్ములు వెంటనే చెల్లించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం5 గంటల వరకే విధులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

'సంక్షేమ పథకాలు జగన్‌తోనే సాధ్యం'

రాజోలు :సంక్షేమ పథకాలు ముఖ్యమంత్రి జగన్‌తోనే సాధ్యమని వైసిపి మండల అధ్యక్షుడు, సోంపల్లి సర్పంచ్ కట్టా శ్రీనివాస్‌రావు అన్నారు. సోంపల్లిలో గ్రామ శాఖ అధ్యక్షుడు కొంబత్తుల బాలయోగి అధ్యక్షతన జరిగిన కార్యకర్తల సమావేశంలో కట్టా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జగన్ పాలనలో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరిందన్నారు. 2024 ఎన్నికల్లో మళ్ళీ జగన్‌ను ముఖ్యమంత్రి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చొల్లంగి సింహాద్రి, బొమ్మిడి వెంకటేష్, తిరుమాని రాజు, కట్టా సత్యనారాయణ, దీపాటి జ్యోతి, కృష్ణమోహన్, కట్టా హరినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఎన్నికల్లో..ఓడిపోయినా బెంగేంలేదు సార్..!! గెల్చిన ప్రభుత్వాన్ని కూల్చేసి ఎలాగూ కారంలోకొచ్చే సత్తా వుంది..!!

కార్మికులకు నూతన దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని గుమ్మిలేరులో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు సోమవారం సర్పంచ్ గుణ్ణం రాంబాబు నూతన దుస్తులను అందజేశారు. క్రిస్మస్ నేపథ్యంలో ప్రతి ఏటా దుస్తులను పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. దీనిలో భాగంగా గ్రామంలో పనిచేస్తున్న ఐదుగురు పారిశుధ్య కార్మికులు నిత్యావసర సరుకులతో పాటుగా కొత్త దుస్తులు అందించామని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాంబాబుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులను ఆదుకోవాలని టిడిపి ధర్నా

ప్రజాశక్తి - కొత్తపేట

అకాల వర్షాలు కారణంగా నష్టపోయిన రైతులను ఆదుకోవాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో సోమవారం ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. టిడిపి జిల్లా అధ్యక్షులు రెడ్డి అనంత కుమారి, టిడిపి తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, కొత్తపేట నియోజక అధ్యక్షుడు జక్కంపూడి వెంకటస్వామి పార్టీ నేతలతో కలిసి అధికారులకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాటాడారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా నియోజకవర్గం పరిధిలో రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. కళ్లాల్లో ధాన్యం తడిసి ముద్దయిందన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినా కొనుగోళ్లలో జాప్యం కారణంగా ధాన్యం కళ్లాల్లోనే ఉండిపోయిందన్నారు. రైతులు పడుతున్న ఇబ్బందులు గుర్తించి తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు, మండల అధ్యక్షులు కె.శ్రీనివాస్, నాయకులు పి.రామారావు, ఎం.గోపాలం, ఇ.సత్తిబాబు, సిహెచ్.భాస్కర్ రావు, వై.బుజ్జి, బి.జయలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


పాడైన పంటతో నిరసన తెలుపుతున్న నాయకులు

టిడ్కో ఇళ్ల వద్ద కానరాని మౌలిక వసతులు

మండపేట : స్థానిక గొల్లపుంత కాలనీలోని టిడ్కో ఇళ్లకు వైసిపి ప్రభుత్వం రంగులు మార్పులు తప్ప చేసిందేమీ లేదని ఎంఎల్ఎ వేగుళ్ల జోగేశ్వరరావు విమర్శించారు. సోమవారం గొల్లపుంత కాలనీలోని టిడ్కో ఇళ్లను టిడిపి నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. నివాసితులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కనీస సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. విద్యుత్, తాగునీరు ఇతర సౌకర్యాలు లేవన్నారు. మరుగుదొడ్లు లేక మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అన్ని సౌకర్యాలు కల్పించి ఇళ్లు అప్పగిస్తామని ప్రభుత్వం చెప్పినా క్షేత్రస్థాయిలో అది జరగట్లేదన్నారు. హెల్ప్ డెస్క్ ఉందోలేదో తెలీని పరిస్థితి నెలకొందన్నారు.

విజయేంద్రసరస్వతికి మంత్రి వేణు స్వాగతం

రామచంద్రపురం : కోటిపల్లిలోని శ్రీ చాయ సోమేశ్వర స్వామి ఆలయానికి వచ్చిన కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్రసరస్వతికి బిసి సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ రేవు శ్రీను, ఎంపిపి పంపన నాగమణి, ఎండోమెంట్స్ అసిస్టెంట్ కమిషనర్ కెఎన్‌విడివి.ప్రసాద్, ఇఒ తారకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


బదిలీ అయిన సిబ్బందిని సత్కరిస్తున్న సర్పంచ్ సతీష్‌కుమారి

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం

గ్రామాల్లోని పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని వెంకటాయపాలెం సర్పంచ్ యల్లమెల్లి సతీష్‌కుమారి అధికారులకు, పంచాయతీ సిబ్బందికి సూచించారు. సోమవారం గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. గ్రామాభివృద్ధికి అందరూ సహకరించాలన్నారు. ప్రస్తుతం సీజనల్ వ్యాధులు పెరగడానికి అపరిశుభ్రత ప్రధాన కారణమన్నారు. చెత్త లేకుండా గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని, దీనికి అధికారులు, పంచాయతీ సిబ్బంది బాధ్యత వహించాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో పనిచేసి బదిలీపై వెళ్లిన జూనియర్ అసిస్టెంట్ చక్రబాబు, ఎఎన్ఎం మరియమ్మ, కామేశ్వరరావులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గంధం విజయభాస్కర్(బుజ్జి), వై.రవికుమార్, కార్యదర్శి త్రినాథ్, సచివాలయం, పంచాయతీ సిబ్బంది, ఆశాలు, వాలంటీర్లు పాల్గొన్నారు.



పతకాలను సాధించిన విద్యార్థులతో శ్రీభారతి కరస్పాండెంట్ వీరబాబు, ఉపాధ్యాయులు

కరాటేల్లో శ్రీ భారతి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ఇటీవల భూమి కరాటే అకాడెమీ నిర్వహించిన కరాటే పోటీల్లో ప్రత్తిపాడు మండలంలోని వొమ్మంగి శ్రీభారతి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ ఎస్.వీరబాబు మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యతో పాటు ఇతర మార్షల్ ఆర్ట్స్, స్పోర్ట్స్‌ల్లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. ఇటీవల జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఎపి స్టేట్ కరాటే ఛాంపియన్‌షిప్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రథమ, ద్వితీయ బహుమతులు కైవసం చేసుకుని ముందంజలో నిలిచారన్నారు. ఏడో తరగతి చదువుతున్న సిహెచ్.కోదండరాం, ఎస్.మల్లేశ్వర్, కె.కార్తికేయ, జె.దేవిసత్య, ఆరో తరగతి చదువుతున్న ఎన్.ప్రవీణ్, ఒకటో తరగతి చదువుతున్న జి.తేజస్విని బంగారు పతకాలు సాధించారన్నారు. 6వ తరగతి చదువుతున్న ఎన్.ప్రవీణ్, ఏడవ తరగతి చదువుతున్న జె.నవీన్, డి.అరవింద్, జి.హర్ష, జె.అవినాష్, ఎస్.కీర్తి, జె.దేవిసత్య, ఇ.లారెన్స్ రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్స్ పొందారని తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను హెచ్‌ఎం ఆర్.బుల్లిరమణ, ఆర్‌ఎన్ సిహెచ్.కృష్ణ, సిహెచ్.రాము, పీడీలు గోవింద్, పి.బుజ్జి అభినందించారు.



క్వార్టర్ ఫైనల్స్‌లో తలపడుతున్న క్రీడాకారులు

హోరాహోరీగా టెన్నిస్ పోటీలు

ప్రజాశక్తి - పెద్దాపురం

స్థానిక లిటరరీ అసోసియేషన్ గ్రౌండ్ లో గిఫ్ట్స్,లిటరరీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి టెన్నిస్ ఛాంపియన్షిప్ పోటీలు మూడవరోజు హెూరా హెూరీగా జరుగుతున్నాయని టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు రాజా సూరిబాబు రాజు, పసల పద్మ రాఘవ రావులు సోమవారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక,గుజరాత్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల నుండి 140 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారన్నారు. 35 ప్లస్,45 ప్లస్,55 ప్లస్,65 ప్లస్,70 ప్లస్ విభాగాల్లో డబుల్ ,సింగిల్స్ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారన్నారు. సోమవారం రాత్రి క్వార్టర్ ఫైనల్స్ పోటీలు ముగిశాయన్నారు.13వ తేదీ నుండి అన్ని విభాగాల్లో సెమీఫైనల్స్ పోటీలు జరుగుతాయన్నారు.70 ప్లస్ డబుల్స్ విభాగంలో క్రీడాకారులు ఏఆర్ రావు, జి.పార్వతీశంలు, డాక్టర్ ఎస్ రామకృష్ణ, వరప్రసాద్‌లు సెమీఫైనల్స్ కు చేరుకున్నారన్నారు.

ఆదిత్యలో 13వ స్టాటస్టిక్స్ ఒలింపియాడ్ పరీక్ష

- 25 తేదీ లోగా రిజిస్ట్రేషన్‌కు చేయించుకోవాలి

ప్రజాశక్తి- కాకినాడ

స్థానిక ఆదిత్య డిగ్రీ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ సి.ఆర్.రావు అడ్వాన్స్డ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మ్యాథమెటిక్స్, స్టాటస్టిక్స్ అండ్ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో స్టాటస్టిక్స్ ఒలంపియాడ్-2022 పరీక్ష నిర్వహించనున్నట్లు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బిఈవిఎల్ నాయుడు తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరానికి గాను ఈ పరీక్షను 2023వ సంవత్సరం జనవరి 29 ఆదివారం ఉదయం 9:30 నుండి కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నారు. ఈ పరీక్ష రాయడానికి అర్హత గల అభ్యర్థులు ఈ నెల 25 తేదీ లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవలసి ఉంటుంది. ఒలంపియాడ్ 2022 పరీక్ష జూనియర్ కేటగిరీలో ప్రస్తుతం 9,10 తరగతులు చదువుతున్నవారు, సీనియర్ కేటగిరిలో 11,12 తరగతులు లేదా ఇంటర్మీడియట్, డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతున్న వారు అర్హులు. జనరల్ నాలెడ్జ్, లాజికల్ థింకింగ్, కాంప్రహెన్షన్స్ రూపంలో ఉండే ఈ పరీక్షలో మొదటి మూడు స్థానాలు సాధించిన విజేతలకు ప్రథమ స్థానం రూ.15,000, ద్వితీయ స్థానం రూ.10,000, తతీయ స్థానం రూ.7,000 నగదు బహుమతులు, మొదటి 15 స్థానాల్లో నిలిచిన ర్యాంకర్లకు ప్రశంసా పత్రాలను అందజేస్తారు. అంతర్జాతీయ స్థాయిలో జరగనున్న ఈ పరీక్షకు గోదావరి జిల్లాలలో కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాల కేంద్రంగా ఉంటుందని, ఈ పరీక్షకు రూ.150 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు www.crraoaimscs.res.in వెబ్‌సైట్‌లో చూడాలని తెలిపారు.

నిర్లక్ష్యం వీడండి.. భద్రత పాటించండి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

వాహనాలు నడిపే సమయంలో ప్రజల నిర్లక్ష్యం విడనాడాలని, భద్రత చర్యలు పాటించాలని కాకినాడ జిల్లా ఎస్‌పి ఎం.రవీంద్రనాథ్ బాబు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు అధికారులతో రహదారి భద్రతపై పోలీస్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాత్రి సమయంలో వాహనాలను హైవే రోడ్లపై నిలిపి ఉంచడం వలన ప్రమాదాల జరుగుతు న్నాయని, దీనివల్ల ఎన్నో కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని, కుటుంబంలో సంపాదించే వ్యక్తి కోల్పోతే ఆ కుటుంబ పరిస్థితి దయాయ స్థితిలో ఉన్నందున ప్రజలు దీనిపై దృష్టి సారించాలన్నారు. పోలీస్ శాఖ వాహనదారులను, ప్రజలను, విద్యార్థులకు చైతన్యపరిచేలా అవగాహన కార్యక్ర మాలు నిర్వహించాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గించడానికి, ముఖ్య హైవేలు, ముఖ్య రహదారులను ఎనిమిది జోన్లుగా విభజించి, ఒక్కో జోనుకు రహదారి భద్రత వాహనాన్ని కేటాయించి, ఒక సిఐ ను ఇన్‌చార్జిగా నియమించి 24 గంటలు రహదారులపై ప్రజలకు అందుబాటులో ఉండేటట్లు చర్యలు తీసుకున్నా మన్నారు. ప్రతిరోజు నో యాక్సిడెంట్ డే నిర్వహించే రహదారి ప్రమాదాలను నివారించాలన్నారు. సమావేశంలో ఎఎస్‌పిలు పి.శ్రీనివాస్, ఎం.అంబికా ప్రసాద్, కాకినాడ ట్రాఫిక్ డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు, కాకినాడ పట్టణ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ నేత మోగంటి మృతి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం



మోగంటి నాగేశ్వరరావు (ఫైల్)

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ నేత మోగంటి నాగేశ్వరావు (82) సోమవారం మృతి చెందారు. ఆయన గతంలో సిపిఎం, సిఐటియులో పని చేశారు. కోనసీమ ప్రాంతంలోని ముక్తేశ్వరం వద్ద గల వీరవల్లిపాలెంలో మోగంటి సుబ్రహ్మణ్యం, శేషమ్మ దంపతులకు 1940లో జన్మించాడు. 14వ ఏటనే తన తండ్రిని కోల్పోయాడు. 3వ తరగతి వరకు చదువుకున్న ఎంఎన్ ఆర్థిక సమస్యలతో చదువును నిలిపేశాడు. కుల వత్తి అయిన స్వర్ణకార పని చేశారు. అమలాపురం, కపిలేశ్వరపురం మండలం అంగరలో కొంత కాలం ఇదే వృత్తిని కొనసాగించారు. అంగరలో తోరాటి లక్షణమూర్తి సహచరుడు కొలువుల నీలకంఠంతో పరిచయం ఏర్పడింది. అప్పటి నుంచి ఆయన వామపక్ష భావజాలాన్ని అలవర్చుకున్నారు. 1962లో రాజమండ్రి చేరుకుని ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీలో పని చేశారు. 1964లో సిపిఎం సభ్యత్వం పొందారు. 1968 తర్వాత నక్సలైట్ ఉద్యమం వైపు వెళ్లి ఇది సరికాదనిగ్రహించి తిరిగి 1970లో సిపిఎంలో చేరారు. 1971లో ఎపి పేపర్ మిల్లు యూనియన్ ఆర్గనైజర్‌గా బాధ్యతలు తీసుకున్నాడు. 1986 నుంచి 1988 వరకు కాకినాడ పట్టణ కార్మికోద్యమంలో బాధ్యతలు నిర్వహించారు. 1971లో పార్టీ పేపర్ మిల్లు యూనియన్ శాఖా కార్యదర్శిగా, 1973 నుండి పట్టణ కమిటీ సభ్యునిగా, 1980 నుండి 1997 వరకు జిల్లా కమిటి సభ్యుడుగా, 1983నుండి 1995 వరకు కార్యదర్శి వర్గ సభ్యునిగా పనిచేశారు. 1997వరకు రాజమండ్రి పార్టీ పట్టణ కమిటీ కార్యదర్శి గాను భాధ్యతలు చూశారు. 2003నుంచి పార్టీకి దూరంగా ఉన్నా రాజకీయంగా మార్క్సిస్టు సైద్ధాంతిక భావజాలంతోనే కొనసాగారు. 2007లో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ స్థాపించారు.

సిపిఎం సంతాపం

పూర్వ సిపిఎం నేత, సీనియర్ సిటి జన్స్ నాయకులు, కార్మిక నేత ఎం.నాగేశ్వరరావు మతికి సిపిఎం తూర్పుగోదావరి జిల్లా కమిటీ సంతాపాన్ని వ్యక్తం చేసింది. రాజమహేంద్రవరంలోని పి అండ్ టి కాలనీలో స్వగహంలో ఆయన మతదేహాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి టి.అరుణ్, జిల్లా సీనియర్ నాయకులు టిఎస్.ప్రకాష్, పోలిన వెంకటేశ్వరరావు, ఎస్ఎస్.మూర్తి, టి.సావిత్రి, సిపిఎం నగర కార్యదర్శి బి.పవన్, సిపిఎం నాయకులు జి.తాతారావు, జి.భాస్కర్, కె.సురేష్, సోమేశ్వరరావు సందర్శించి నివాళులర్పించారు. సుదీర్ఘ కాలం సిపిఎం, కార్మిక సంఘాల నిర్మాణం లోను పని చేసిన నాగేశ్వరరావు మతికి సిపిఎం నాయకులు సంతాపం తెలిపారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.

గురువులకు స్థానచలనం

- మొదలైన బదిలీల ప్రక్రియ
- ఎంఇఒ, హెచ్‌ఎంలతో ఇన్‌ఛార్జి డిఇఒ సమావేశం

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌ఛార్జ్ డిఇఒ

పాఠశాలల ప్రారంభానికి ముందు చేపట్టవలసిన ఉపాధ్యాయ బదిలీలకు ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేయడంతో అటు ఉపాధ్యాయులు, ఇటు విద్యార్థుల్లోనూ ఉత్కంఠ నెలకొంది. ఏటా వేసవి సెలవుల అనంతరం నిర్వహించే ఉపాధ్యాయ బదిలీల ప్రక్రియ విద్యా సంవత్సరం ప్రారంభమైన 5నెలల తర్వాత చేపట్టింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సుమారు 2,200 మంది ఉపాధ్యాయులకు స్థానచలనం కలిగే అవకాశాలు ఉన్నాయి. జీరో సర్వీసు వారూ బదిలీలకు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించడంతో ఆ సంఖ్య మరింత పెరిగే అవకాశాలు న్నాయి. విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తిని పరిశీలించి పిల్లలు తక్కువగా ఉన్న పాఠశాల నుంచి ఇతర ప్రాంతాలకు కేటాయింపులు జరిగే అవకాశం ఉంది. క్రమబద్ధీకరణతో పోస్టు కోల్పోయిన చోట జూనియర్ ఉపాధ్యాయులు బదిలీకి దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంటుంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాలల్లో 20 మందికి ఒక ఉపాధ్యాయుడు ఉండే అవకాశముంది. ఒక్క విద్యార్థి ఎక్కువ ఉన్నా రెండో పోస్టు కేటాయించనున్నారు. లేకుంటే ఒక్కరితోనే సరిపెట్టనున్నారు. ఉన్నత పాఠశాలల్లో 96 మంది కన్నా విద్యార్థులు తక్కువగా ఉంటే హెచ్‌ఎం, వ్యాయామ ఉపాధ్యాయుడి పోస్టులు తొలగిస్తారు. 138 మంది మించి ఉంటే సబ్జెక్టుకు ఇద్దరు చొప్పున కేటాయిస్తారు. 50 ఏళ్ల కన్నా తక్కువ వయస్సు కలిగిన పురుష ఉపాధ్యాయులు బాలికల ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తుంటే వారిని తప్పనిసరిగా బదిలీ చేయనున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా భౌతికంగా ఉపాధ్యా యులు లేని ఖాళీలను 64 మండలాలకు నిష్పత్తి ప్రకారం కేటాయించి వాటిని బ్లాక్ చేస్తారు. అక్టోబరులో 505 మంది ఉద్యోగోన్నతులు పొందారు. వారు పాత స్థానాల్లోనే కొనసాగు తున్నారు. వారు కూడా బదిలీలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. సీనియారిటీని పరిగణలోకి తీసుకుని పోస్టులు కేటాయించనున్నారు.

ఆక్వా రైతుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్



ఆక్వా రైతుల సదస్సులో మాట్లాడుతున్న రఘురాం

రాష్ట్రవ్యాప్తంగా ఆక్వా రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దష్టికి తీసుకువెళి క్రాప్ హాలిడే ప్రకటించకుండా వారి సమస్యను పరిష్కరించేందుకు కషి చేస్తానని ఏపీఎస్ఏడిప రాష్ట్ర వైస్ చైర్మన్ వడ్డీ రఘురాం అన్నారు. కాకినాడలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో రాష్ట్ర ఆక్వా రైతుల అవగాహన సదస్సును ఆక్వా రైతు సంఘ ప్రతినిధి సిహెచ్‌వి సూర్యారావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆక్వా రైతుల పడుతున్న ఇబ్బందులు రాష్ట్ర వైస్ చైర్మన్ రఘురాం దృష్టికి తీసుకువచ్చారు. ఆక్వా రైతులకు పాదయాత్రలో ఇచ్చిన హామీలను తక్షణం నెరవేర్చాలని రూ.45-50 ఫీడ్ వస్తేనే ఆక్వాను ముందుకు తీసుకు వెళ్లగలమని, ఆక్వా రైతుల కోసం ఇప్పటికే నాలుగు సమావేశాలు నిర్వహించి, సమస్యలు పరిష్కరించడంలో విఫలమయ్యారని, కరోనా ముందు ఎటువంటి ధరలు నిర్ణయించారో వాటినే మరలా పునరుద్ధరించాలని, రూ.1.5 కే ఆక్వారంగానికి కరెంటు అందించాలని రైతులు కోరారు. అనంతరం వైస్ చైర్మన్ రఘురాం మాట్లాడుతూ రైతుల సమస్యలన్నింటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. అవసరమైతే పోరాటానికి సిద్ధమని, రైతుల క్రాప్ హాలిడే ప్రకటించకుండా వారి సమస్యలు పరిష్కారానికి ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి ఆక్వా రైతులు పాల్గొన్నారు.

మొదటి విడతగా 180 ట్యాబ్‌లు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట మండల పరిధిలో ప్రస్తుత ఎనిమిదో తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మొదటి విడతగా 180 ట్యాబ్‌లు వచ్చినట్టు ఎంఇఒ వై శివరామకష్ణయ్య సోమవారం విలేకరులకు తెలిపారు. మండల పరిధిలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు బాలురు 646, బాలికలు 570 వెరసి 1,216 మంది ఉన్నట్టు చెప్పారు. విద్యార్థుల చదువులు ప్రోత్సహిస్తూ ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిదో తరగతి చదువుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థులందరికీ రూ. 14,500 విలువచేసే ట్యాబ్‌లను ఉచితంగా అందిస్తు న్నట్లు చెప్పారు. దానిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన పథకంలో మొదటి విడతగా 180 ట్యాబ్ లు మండలానికి అందినట్లు తెలిపారు. మిగిలిన 1,036 ట్యాబ్‌లు త్వరలోనే రానున్నట్లు చెప్పారు. ఈ ట్యాబ్ లలో బైజ్యూస్ స్టడీ సంస్థకు చెందిన యాప్‌ను అందుబాటులో వచ్చినందున విద్యార్థులు మెరుగైన విద్యను పొందే అవకాశం కల్పించారన్నారు. కార్యాలయానికి చేరిన ట్యాబ్ ల పనితీరును ఎంఇఒ సిబ్బంది పరిశీలించారు.

పిఎంఎంఎస్‌వై యూనిట్లు త్వరగా ప్రారంభించాలి

-మత్స్యశాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశాలు

ప్రజాశక్తి - కాకినాడ

జిల్లాలో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పథకం విజయవంతానికి ప్రణాళికాయుత చర్యలు తీసుకోవాలని, మంజూరు చేసిన యూనిట్లు వీలైనంత త్వరగా ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా మత్స్య శాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ కోర్టుహాల్‌లో సోమవారం కలెక్టర్ కృతికా శుక్లా అధ్యక్షతన జిల్లా స్థాయి కమిటీ జరిగింది. పథకం వివరాలను జిల్లా మత్స్య అధికారి పీవీ సత్యనారాయణ వివరించారు. పథకం ద్వారా యూనిట్ వ్యయంపై జనరల్ కేటగిరీలో 40 శాతం, మహిళల, ఎస్‌సి, ఎస్‌టి కేటగిరీలో 60 శాతం రాయితీ లభిస్తుందని తెలిపారు. పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు వీలుగా అవగాహన కార్యక్రమాలు ఏర్పాటుచేసి, దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు వెల్లడించారు. కలెక్టర్ కృతికా శుక్లా మాట్లాడుతూ చేపల ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడం, మత్స్యకారుల జీవన ప్రమాణాలను మెరుగుపరచడంతో పాటు ప్రజలకు పోషణ భద్రత కల్పించే లక్ష్యంతో పీఎంఎంఎస్‌వై అమలవుతోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆక్వా ఉత్పత్తులకు స్థానికంగా మార్కెటింగ్ సదుపాయాలు కల్పించేందుకు హబ్ అండ్ స్పోక్స్ నమూనాను రూపొందిం చిందన్నారు. పీఎంఎంఎస్‌వై కింద జిల్లాలో దాదాపు రూ.1.94 కోట్లతో 127 యూనిట్ల ఏర్పాటుకు తాజా సమావేశం ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు. ఐస్ బాక్సుతో కూడి మోటార్ సైకిళ్లు, ఈ-రిక్షాలు, ఇన్సులేటెడ్ వాహనాలు తదితరాలతో పాటు ఫిష్ కియోస్కు, ఫిష్ కియోస్కు, లైవ్ ఫిష్ వెండింగ్ యూనిట్లు, విలువ జోడింపు ఉత్పత్తుల యూనిట్లు కూడా ఏర్పాటు కానున్నాయని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో ఆమోదం పొందిన యూనిట్లు త్వరగా ప్రారంభమయ్యేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశం చారు. సమావేశంలో జడ్‌పి సిఇఒ ఎన్‌వీవీ సత్యనారాయణ, జిల్లా మత్స్య అధికారి పీవీ సత్యనారాయణ హాజరయ్యారు.

సేవల నమోదుపై అవగాహన

ప్రజాశక్తి - ఉండ్రాజవరం

మాతా శిశు సంరక్షణ సేవలు నూరుశాతం అంతర్జాలంలో నమోదు చేయడంపై పిహెచ్‌సిలో వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో సోమవారం అంగన్వాడీ సిబ్బందికి, ఆరోగ్య కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలకు, శిశువులకు చేసే పరీక్షలు, ఇచ్చే సేవలను అంగన్‌వాడీ టీచర్, ఎఎన్‌ఎంలు సమన్వయం చేసుకుంటూ, ఎప్పటికప్పుడు అన్నింటినీ అంతర్జాలంలో నమోదు చేయాలన్నారు. సిపిడిఒ శ్రీలక్ష్మి, ఐసిడిఎస్ సూపర్‌వైజర్ సరోజిని, సిహెచ్‌ఓ సుబ్రహ్మణ్యం, పిహెచ్‌ఎన్ కుమారిచ సూపర్‌వైజర్లు శ్రీనివాసరావు, సుభాషిణి, నాగమణి పాల్గొన్నారు.

ఎస్‌కెఆర్‌లో పూర్వ విద్యార్థినుల సమావేశం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సోమవారం పూర్వ విద్యార్థినుల కలయిక నిర్వహించారు. ఈ సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.రాఘవకుమారి మాట్లాడుతూ ప్రస్తుత సేవలకు తోడు అదనపు కార్యక్రమాలు చేపట్టాలని కొన్ని ప్రతిపాదనలు చేశారు. ఆలూమ్ని పూర్వ అధ్యక్షురాలు డాక్టర్ డి.పద్మావతి, సభ్యులందరూ చర్చించుకుని తెలియజేస్తామని చెప్పారు. టిజె.రాధాదేవి, డాక్టర్ డి.పద్మావతి, శ్యామలాంబ, లీగల్ అడ్వైజర్ వి.కష్ణకుమారి తదితరుల పర్యవేక్షణలో అలూమ్ని కార్యక్రమాలు బహుముఖ ప్రయోజనకరంగా ఉన్నాయని చెప్పారు. డిఎల్ చిరంజీవి, జక్కంపూడి లత, టి.తులసీకుమారిని ఘనంగా సత్కరించారు. వి.ఉమాజ్యోతి, పి.రంజిని, జి.లలిత, డాక్టర్ మేజర్ కళ్యాణి, టి.మంగాయమ్మ పాల్గొన్నారు.

14, 15న ప్రణాళికాభివృద్ధిపై శిక్షణ

ప్రజాశక్తి-పెరవలి

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 14, 15వ తేదీల్లో ప్రణాకాభివృద్ధి, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల కోసం 2023- 2024 సంవత్సరానికి శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేసినట్టు ఎంపిడిఒ సింగంశెట్టి రమేష్ తెలిపారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు విధిగా హాజరు కావాలని ఆయన సూచించారు.

సైన్స్‌పై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-గోపాలపురం, నల్లజర్ల

విద్యార్థులు సైన్స్‌పై అవగాహన పెంచుకుని నూతన ఆవిష్కరణలు చేయాలని అతిరాస కార్పొరేషన్ చైర్మన్ ఇళ్ళ భాస్కర్ రావు, ఎంపిఇ ఉండవల్లి సత్యనారాయణ విద్యార్థులకు సూచించారు. సోమవారం స్థానిక జెడ్‌పి ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఫెయిర్ కార్యక్రమం ఎంఇఒ జి.శ్రీనివాసరావు, హెచ్‌ఎం సోమశేఖర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి కె.లలిత, ముల్లంగి శ్రీనివాసరెడ్డి, వింత ప్రసాద్ రెడ్డి, గుంజే రమణ పాల్గొన్నారు. నల్లజర్ల మండలంలోని ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎగ్జిబిషన్ సోమవారం ప్రారంభమయ్యింది. వివిధ పాఠశాలల నుంచి సైన్స్ ఎగ్జిబిట్ల ప్రదర్శన నల్లజర్లలోని హైస్కూల్లో ప్రదర్శించగా ఎంఇఒ శ్రీనివాసరావు, హెచ్‌ఎంలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కోమల చిత్ర, ఎం.రామారావు కె.బాలసుబ్రమణ్యం పాల్గొన్నారు.

క్షయ నిర్మూలన జిల్లాగా తీర్చిదిద్దాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జిల్లాను టిబి రహితంగా తీర్చిదిద్దాలని జిల్లా రెవెన్యూ అధికారి జి.నరసింహులు పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ స్పందన సమావేశ మందిరంలో ని క్షయ్ మిత్ర పథకంలో నలుగురిని దత్తత తీసుకున్నారు. రూ.16800ను జిల్లా పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్‌జిటి.సత్య గోవింద్ ఆన్‌లైన్‌లో ని క్షయ్ మిత్ర బ్యాంకు ఖాతాకు జమ చేశారు. జిల్లాలో క్షయవ్యాధిని సమూలంగా నిర్మూలన చేసే దిశలో వ్యాధిగ్రస్తులకు పోషక విలువలతో కూడి మంచి పౌష్టకాహారం అందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని డిఆర్‌ఒ నరసింహులు అన్నారు. జిల్లాలో సుమారు 1400 మంది క్షయ బాధితులు ఉన్నారని వారిలో ఇప్పటి వరకు 378 మందిని 64 మంది నిక్షయ మిత్రులు పేర్లు నమోదు చేసుకుని దత్తత తీసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, జిల్లా పశుసంవర్ధక అధికారి ఎస్‌జిటి.సత్య గోవింద్, డాక్టర్ ఎన్.వసుంధర పాల్గొన్నారు.

శరవేగంగా రాజమహేంద్రవరం అభివృద్ధి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో రాజమహేంద్రవరం నగరం శరవేగంగా అభివృద్ధి చెందుతోందని ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. సోమవారం నగరంలోని 31వ వార్డులో రూ.కోటి వ్యయంతో చేపట్టబోయే వివిధ అభివృద్ధి పనులకు ఎంపీ భరత్ శ్రీకారం చుట్టారు. తొలుత ఈ వార్డులలో చేపట్టే పనుల వివరాలతో కూడిన పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం అజాద్ చౌక్ వద్ద శంకుస్థాపన శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎంపీ భరత్ మాట్లాడుతూ నగర అభివృద్ధికి సిఎం జగన్ రూ.125 కోట్లు మంజూరు చేశారని, అది కాకుండా ప్రతి గ్రామ సచివాలయానికి రూ.20 లక్షలు మంజూరు చేశారన్నారు. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయా వార్డులలో అభివద్ధి పనుల నిమిత్తం ప్రతి వార్డుకూ రూ.కోటి మంజూరు అయ్యాయన్నారు. టిడిపి హయాంలో ఎప్పుడూ ఇన్ని కోట్లు నగరానికి మంజూరు చేసిన దాఖలాలు లేవన్నారు. సభలో కమిషనర్ కె.దినేష్ కుమార్, రుడా చైర్‌పర్సన్ షర్మిలారెడ్డి, పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పాలిక శ్రీను, అరీఫ్, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి, పిల్లి నిర్మల, ఆదినారాయణ, ఎన్వీ శ్రీనివాస్ పాల్గొని ప్రసంగించారు.

రోగులకు పౌష్టికాహారం కిట్ల పంపిణీ

ప్రజాశక్తి-బిక్కవోలు

బిక్కవోలు పిహెచ్‌సిలో జిల్లా అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ వసుంధర గ్రాసిమ్ ఇండస్ట్రీ ప్రతినిధుల ఆధ్వర్యంలో 23 మంది టిబి రోగులకు సోమవారం పౌష్టికాహార కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ వసుంధర మాట్లాడుతూ టిబిని త్వరగా గుర్తించి చికిత్స చెయ్యడం ద్వారా అరికట్టవచ్చని , తద్వారా ఇతరులకు ఈ వ్యాధి సోకకుండా రక్షించవచ్చని చెప్పారు. గ్రాసిమ్ ఇండస్ట్రీ 23 మంది టిబి రోగులు ను దత్తత తీసుకుని ఒక్కకరికీ రూ.713 విలువైన కిట్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రాసిమ్ ప్రతినిధులు క్రాంతికుమార్, ముని భాస్కర్ రెడ్డి, డాక్టర్ రాజీవ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-గండేపల్లి



మొక్కలు నాటుతున్న దృశ్యం

ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు బాధ్యత తీసుకోవాలని పలువురు పిలుపు ఇచ్చారు. సూరంపాలెం ఆదిత్య విద్యా సంస్థల కన్స్ట్రక్షన్ విభాగం డైరెక్టర్, జిల్లా బ్యాడ్మింటన్ సంఘం మాజీ కార్యదర్శి మేడపాటి భాస్కర చంద్రారెడ్డి పుట్టిన రోజు సందర్భంగా సోమవారం ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. భాస్కర చంద్రారెడ్డికి ఆదిత్య అధినేత డాక్టర్ శేషారెడ్డి, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.సతీష్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎం.శ్రీనివాస్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎగ్జామినేషన్స్ విభాగం డీన్ జొన్నలగడ్డ పవన్, జాతీయ పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత తోటకూర గంగాధర్, ఆదిత్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

ప్రజాశక్తి- నల్లజర్ల, సీతానగరం

నల్లజర్ల మండలం ఆవపాడులో అయినపర్తి సీతయ్య (38) సోమవారం విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఒక రైతు చేలో పామాయిల్ గెలలు కోసేందుకు కూలి పనికి వెళ్లాడు. పామాయిల్ గెలలు కోస్తూ ఉండగా అనుకోకుండా పక్కనే ఉన్న విద్యుత్ వైర్లకు చేతిలో ఉన్న ఇనుప కత్తి తగలడంతో సీతయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. సీతయ్యకు భార్య దుర్గ కుమార్తె, పోసమ్మ ఉన్నారు. కూలి నాలి చేసుకుని కుటుంబాన్ని పోషించుకునే సీతయ్య మతితో ఆ కుటుంబం రోడ్డున పడింది.

విద్యుత్ తీగలు తగిలి లారీ డ్రైవర్ మృతి

సీతానగరం మండలం రఘుదేవపురంలో రహదారిలో విద్యుత్ తీగలు తగిలి లారీ డ్రైవర్ మృతి చెందాడు. ధాన్యాన్ని మార్కెట్‌కు లారీపై తరలిస్తుండగా లారీ డ్రైవర్ సమర్తగుర్తి వాడపల్లి (32) లారీ పైకి ఎక్కాడు. పమాదవశాత్తు చెయ్యి లారీ పైన ఉన్న సర్వీసు వైర్లకు తగిలి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శుభ శేఖర్ తెలిపారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

గంగాధర్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఆదిరెడ్డి ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ సోమవారం ట్రోఫీలను అందచేశారు. విన్నర్స్, రన్నర్స్ కు ట్రోఫీలను అందజేశారు. అనంతరం ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకున్న వారెందరో ఉన్నారని, వారిని నేటి యువత ఆదర్శంగా తీసుకుని క్రీడల్లో రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి కె.రమణ, డి.గంగాధర్, చాపల చిన్ని రాజు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు



గాయపడిన బాధితులు

ఆటో బోల్తా.. ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి-సామర్లకోట రూరల్

సామర్లకోట-కాకినాడ కెనాల్ రోడ్డులో వెంకటకృష్ణారాయపురం-మాధవ పట్నం గ్రామాల మధ్యలో సోమవారం ఆటో ప్రమాద వశాత్తూ రోడ్డు పక్కన గల పంట కాలువలోకి దూసుకువెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు ప్రయాణికులకు ఆరుగురికి గాయాల య్యాయి. కాకినాడ కు చెందిన వారు సోమవారం పెద్దాపురంలో తమ బంధువుల ఇంట జరిగిన శుభ కార్యానికి హాజరయి, తిరుగు ప్రయా ణంలో మాధవపట్నం సమీపించేసరికి ముందుగా వెళుతున్న వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తున్న సమయంలో ఆటో అదుపు తప్పి కాలువలోకి బోల్తా పడింది. గాయపడిన వారిని స్థానికుల సహాయంతో కాకినాడ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఇంద్రపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు.